క్లుప్తంగా

ఆహార ఆరోగ్య చార్ట్ ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక సేవకుడు, పుడమి రత్న అవార్డు గ్రహీత పట్వారి తులసి కుమార్ రూపొందించిన ఆహార ఆరోగ్యం చార్ట్‌ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'భవిష్యత్తులో విద్యార్థులు, యువత ఆరోగ్యంపై శ్రద్ధ చూపి సరైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతిరోజు యోగా, ధ్యానం చేసే అలవాట్లను అలవరచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ చార్ట్‌ను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అందజేయాలని సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ పొడిగింపు

ఆర్మూటౌన్‌: ఎల్‌ఆర్‌ఎస్–2020 కింద ప్లాట్‌ను క్రమబద్ధీకరించుకునే వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అవకాశాన్ని ఇంకా ఎక్కువ మంది పొందేందుకు ఈ రాయితీ గడువును ఏప్రిల్ 30 వరకు ప్రభుత్వం పొడిగించిందని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోలేని దరఖాస్తుదారులు, త్వరగా ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రత్యేక రాయితీని ఉపయోగించుకుని, మీ ప్లాట్‌ను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి



మోర్తాడ్‌: వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని భీమ్‌గల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగుల సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం తమ కార్యాలయంలో కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడటం, ఉపాధి పనులకు కూలీలను అధిక సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్, ఇందిరమ్మ ఇండ్ల జాబితాల పరిశీలన, నర్సరీల నిర్వహణపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఎంపీవో జావిద్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



బోధన్‌: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనా విధానాలను వ్యతిరేకిస్తూ రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్లతో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేతలు మంగళవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు ఇచారు. నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం పట్టణ కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ ప్రాంతంలో ఆ పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ ఆవిష్కరించారు.

మాభూమి రథయాత్ర కరపత్రాలు..



బాల్కొండ: మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు ఈ నెల 14 నుంచి చేపడుతున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మురళి, మండల అధ్యక్షుడు నిశాంత్, నాయకులు ఆత్మగౌరవ్, క్రాంతి కిరణ్, అన్వేష్, రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రీతం దేశాయ్‌కు నివాళి



బోధన్‌: బోధన్‌కు చెందిన వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు వీఆర్ దేశాయ్ కుమారుడు ప్రీతం దేశాయ్(46) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం పట్టణ కేంద్రంలో వీఆర్ దేశాయ్ కుటుంబీకులను పలువురు పరామర్శించారు. మహారాష్ట్ర ప్రాంతం నాందేడ్ జిల్లాకు చెందిన బీజేపీ రాజ్యసభ ఎంపీ అజిత్ గోప్‌చడే, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలల అదనపు డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ పరామర్శించి నివాళులర్పించారు.

తాగు నీటి సరఫరాకు ప్రణాళికలు

- బోధన్ పట్టణంలో నీటి సమస్య అధిగమించేందుకు చర్యలు
- పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్న అధికారులు



బోధన్ పట్టణానికి నీటిని సరఫరా చేసే బెల్లాల్ చెరువు

బోధన్‌టౌన్(బోధన్) : వేసవి కాలంలో పట్టణంలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు బోధన్ మున్సిపల్ యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. పైప్‌లైన్ లీకేజీలతో నీరు వృథా పోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. బోధన్ మున్సిపాలిటీ పరిధిలో 38 వార్డులున్నాయి. ఈ వార్డుల్లో 18,500 నివాసాలు, 12 వేల పైచిలుకు తాగునీటి కుళాయిలున్నాయి. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి బల్దియా ఆధ్వర్యంలో ప్రతి రోజూ 15 ఎంఎల్‌డీ(39 లక్షల 61 వేల గ్యాలన్ల) నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి ..

వేసవి కాలంలో పట్టణ ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇప్పటికే ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. బెల్లాల్ చెరువులోకి నిజాంసాగర్ నీటిని విడుదల చేయించి చెరువులోని నీటి నిల్వను పెంచాలని అధికారులకు సూచించారు. ఇలా జరిగితే పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదు. వేసవి కాలంలో పట్టణ ప్రజల తాగునీటి ఇబ్బందుల పరిష్కారానికి ముందస్తు చర్యగా ఇప్పటికే డీఈతో పాటే ఒక ఏఈ ఇద్దరు అధికారులను కేటాయించారు.

ప్రధాన వనరు బెల్లాల్ చెరువు..

బోధన్ మున్సిపాలిటీలోని ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రధాన తాగునీటి వనరు బెలాల్ చెరువు. ఈ చెరువు సామర్థ్యం 12 అడుగులు కాగా ప్రస్తుతం చెరువులో 9.1 అడుగుల నీరు ఉంది. ఈ చెరువు నుంచి నీటిని రాకాసీపేట్‌లో గల వాటర్ వర్క్స్‌కు పైప్‌లైన్ల ద్వారా నీటిని తెచ్చి శుద్ధి చేసి ప్రజలకు ప్రతి రోజు తాగునీటిని సరఫరా చేస్తారు. పట్టణంలోని రాకాసిపేట్, శక్కర్‌నగర్, బోధన్, ఆచన్‌పల్లి, ఎల్‌బీఎస్ నగర్ కాలనీల్లో 10 వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ట్యాంకుల ద్వారా గృహాలకు ప్రతిరోజు నీటి సరఫరాను చేస్తుంటారు.

రూ.40 లక్షల కేటాయింపు

వేసవికాలంలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ కోసం రూ.40 లక్షలతో నివేదికను తయారు చేశారు. ఈ నిధులతో తాగునీటి లీకేజీలు, బోర్ల మరమ్మతులు, లేబర్ ఎంగేజ్, లీకేజీల మెటీరియల్‌తో పాటు తాగునీటికి సంబంధించిన మిషన్‌ల మరమ్మతుల కోసం నిధులు ఖర్చు చేయాలని బల్దియా యంత్రాంగం నిర్ణయించింది.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

పట్టణ ప్రజలకు వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే తాగునీరు వృథా పోకుండా లీకేజీల మరమ్మతులను అరికడుతున్నాం. ఇప్పటికే ఇద్దరు అధికారులను ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం.

– వెంకటనారాయణ, మున్సిపల్ కమిషనర్

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం



పడగల్‌లో ఉత్సవమూర్తులకు చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

బోధన్, బాన్సువాడ, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలోని పలు రామాలయాల్లో సోమవారం శ్రీరాముడి పట్టాభిషేకం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో సోమవారం కూడా సీతారాముల కల్యాణం జరిపించారు. పండుగ సందర్భంగా ఆలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

కెనడాలో శ్రీరాములోరి కల్యాణం

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ పట్టణం వాసులు కెనడాలోని టొరంటో నగరంలో శ్రీ రాములవారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్‌కు చెందిన అనుష్ గౌడ్, లక్ష్మీ దంపతులు రాములవారి కల్యాణ వేడుకను ఆటపాటలతో చేపట్టారు.



కల్యాణం నిర్వహిస్తున్న ఆర్మూర్ వాసులు



ఎడపల్లి: శ్రీరామమఠంలో సీతారాముల కల్యాణం..



మోస్రా రామాలయంలో..

ఆస్తి పన్ను వసూళ్లలో ఉత్తమ ప్రతిభ

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను వసూలు చేయడంలో ప్రతిభ కనబర్చిన రెవెన్యూ అధికారులను మున్సిపల్ కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్తి పన్నులు వసూలు చేయడంలో జిల్లాలోనే మొదటి స్థానం వచ్చిందని, రెవెన్యూ అధికారులు కృషి, పుర ప్రజలు సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులు దుమాదేవి, దత్తారెడ్డి, వార్డు అధికారులు నర్సయ్య, చక్రధర్, ప్రవళిక, నితిన్‌గౌడ్, బిల్ కలెక్టర్లను సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇన్‌చార్జి డీఈ భూమేష్, సానిటరి ఎస్సై గజానంద్, టీపీవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కమిషనర్ రాజు

నల్ల మట్టి వస్తుందోచ్..!

- ఎస్సారెస్పీ నీటిమట్టం తగ్గడంతో నల్లమట్టి తరలింపునకు అవకాశం
- బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం నుంచి తవ్వకాలు మరూ



ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో తవ్వుతున్న దృశ్యం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నల్ల మట్టి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ నీళ్లకే కాదు నల్ల మట్టికి కూడా మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో నీటి చుక్క లేకపోవడంతో నల్లమట్టి తీయటానికి అనువుగా ఉంది. దీంతో కొందరు రైతులు నల్లమట్టిని యంత్రాలతో తరలిస్తున్నారు. ప్రాజెక్ట్‌లోని నల్ల మట్టిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని రైతుల నమ్మకం. వచ్చే సంవత్సరం పసుపు పంటను సాగు చేసే నేలలో నల్లమట్టిని ఎక్కువగా వేస్తారు. ప్రస్తుతం డంపర్ లోడ్ నల్లమట్టి రూ.10 వేలు పలుకుతోంది. రైతుల కోసం ప్రాజెక్ట్ అధికారులు సైతం ఉచితంగానే సరఫరా చేస్తున్నారు. నల్లమట్టిని తరలించడం వల్ల ప్రాజెక్ట్‌లో కూడా పూడిక తగ్గుతుంది.

యంత్రాలతో తవ్వకాలు..

ప్రాజెక్ట్‌లో పెద్ద పెద్ద యంత్రాలతో తవ్వకాలు చేపడుతున్నారు. ప్రభుత్వం ప్రాజెక్ట్‌లో పూడిక తీత పనులు చేపడతామని గతంలో ప్రకటించింది. ప్రస్తుతం యంత్రాలను ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. యంత్రాలు రైతుల వద్ద లేకపోవడంతో నల్లమట్టి దందా కొందరు వ్యాపారుల చేతుల్లోకి పోయే ప్రమాదం ఉంది. దీని వల్ల మళ్లీ రైతులపై భారం పడుతుంది.

ఉచితంగా సరఫరా చేయాలి

నల్లమట్టిని రైతుల కోసం ప్రాజెక్ట్ నుంచి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలి. ఉచితంగా యంత్రాలను ఏర్పాటు చేసి సొంత ట్రాక్టర్లలో నల్లమట్టిని తరలించుకుంటాం. దీంతో కొంత ఖర్చు తగ్గుతుంది. – గోపాల్, రైతు, రెంజర్ల



వీరన్నగుట్టలో.. కాంగ్రెస్ నాయకులు



రుద్రూర్‌లో.. ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా



పచ్చలనడ్కుడలో .. సొసైటీ చైర్మన్ లింబారెడ్డి

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బోధన్‌: సాలూర మండలంలోని హున్సా సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం, సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను బోధన్ ఏఎంసీ ఇన్‌చార్జి చైర్మన్ చీల శంకర్‌తో కలిసి సొసైటీ చైర్మన్ మందర్నా రవి ప్రారంభించారు. సొసైటీ వైస్ చైర్మన్ వినోద్‌బాబా, ఏఈవో శ్రావణి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు బలోపేతం

రెంజల్(బోధన్): ధాన్యం కొనుగోలు కేంద్రాలతో మహిళా సంఘాలను బలోపేతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొబిన్ ఖాన్ పేర్కొన్నారు. వీరన్నగుట్టలో సోమవారం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. 60 శాతం కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించినట్లు తెలిపారు. నాయకులు సాయరెడ్డి, కుర్మె శ్రీనివాస్, సాయిబాబగౌడ్, ఏపీఎం చిన్నయ్య పాల్గొన్నారు.

రుద్రూర్‌: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా ప్రారంభించారు. తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో భీమ్‌రావ్, విండో చైర్మన్ సంజీవరెడ్డి, విండో డైరెక్టర్ కర్క అశోక్, ఏఎంసీ డైరెక్టర్ పార్వతి ప్రవీణ్, ఐకేపీ ఏపీఎం భాస్కర్, ఏవో సాయికృష్ణ, తదితరులున్నారు.

సోంపూర్‌లో, కొల్లూర్‌లలో....

పోతంగల్ మండలం సోంపూర్ , కొల్లూర్ గ్రామాల్లో సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐకేపీ ఏపీఎం బస్వంత్ రావ్, సీసీలు సాయిబాబా, గ్రామ సంఘం అధ్యక్షురాలు లలిత, తదితరులున్నారు.

వేల్పూర్‌: పచ్చలనడ్కుడలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ లింబారెడ్డి ప్రారంభించారు. మానిటరింగ్ అధికారి దినేష్, డైరెక్టర్లు నర్సారెడ్డి, గంగాధర్, నాగమల్లేష్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: చౌట్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ కుంట ప్రతాప్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. సీఈవో శంకర్ పాల్గొన్నారు.



హున్సా సొసైటీ ఆవరణలో కేంద్రాలు ప్రారంభిస్తున్న చీల శంకర్, సొసైటీ చైర్మన్ రవి

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, సిలిండర్ లింగం, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌: దొన్కల్‌లో కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య ప్రారంభించారు. శెట్‌పల్లి సహకార సంఘం చైర్మన్ సింగిడి రాజేశ్వర్, వైస్ చైర్మన్ సుదర్శన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు రంజిత్, నవీద్, కాంగ్రెస్ నాయకులు గడ్డం అనిల్, జిన్న అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



చౌట్‌పల్లిలో.. చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



నందిపేటలో .. కాంగ్రెస్ నాయకులు



దొన్కల్‌లో.. ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ బార్ న్యాయవాదుల అసోసియేషన్ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ సోమవారంతో ముగిసిందని ఎన్నికల అధికారులు సేరియాల జగన్, కొత్తపల్లి రాములు తెలిపారు. అధ్యక్ష పదవికి జక్కుల శ్రీధర్, టీకే కోనేరు, పీఎస్ విజయలక్ష్మి నామినేషన్లు వేయగా, ఉపాధ్యక్ష పదవికి కుదురుపాక ప్రవీణ్ చందర్, గటాడి ఆనంద్ ..జనరల్ సెక్రటరీ పదవికి గుంజల సుదర్శన్, జెస్సు అనిల్, పి.హరివర్ధన్ నామినేషన్లు వేశారు. ట్రెజరర్, జాయింట్ సెక్రటరీ, లైబ్రరీ సెక్రటరీలకు ఒక్కొక్కరే నామినేషన్ వేశారని ఎలక్షన్ అధికారులు పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రుద్రూర్‌: పోతంగల్ మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారాంతపు సంతకు వచ్చే వారి కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత ఆరేళ్లగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు సంఘ సభ్యులు పేర్కొన్నారు. సభ్యులు జ్యోతి, ప్రణిత, భాగ్యలక్ష్మి, మంజుల, స్వాతి, చంద్రకళ, శ్రీదేవి, సంతోషి, దేవి, వసుధ తదితరులు పాల్గొన్నారు.

భారీ ఎత్తున తరలి రావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్‌: పార్టీ ఆవిర్భావమై పాతికేళ్లు కావస్తున్న సందర్భంగా వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ సభకు బాల్కొండ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున హాజరు కావాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం వేల్పూర్ మండల కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న మూడు రోజుల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.



భిక్షకు హాజరైన హనుమాన్ భక్తులు

హనుమాన్ స్వాములకు భిక్ష

వేల్పూర్‌: మండల కేంద్రంలోని జంబి హనుమాన్ వద్ద బాల్కొండ నియోజకవర్గంలోని ఆంజనేయస్వామి మాలధారణ స్వాములకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం భిక్ష ఏర్పాటు చేశారు. దీనికి ముందు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి – నీరజారెడ్డి సతీసమేతంగా ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. మాలధారణ స్వాములతో కలిసి భక్తిపాటలకు ఎమ్మెల్యే కాసేపు నృత్యం చేశారు. బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ఆంజనేయస్వామి మాలధారులు భారీగా పాల్గొన్నారు.

వరంగల్ సభకు కదం తొక్కాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): వరంగల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు గులాబీ సైనికులు కదం తొక్కి కదలాలని ఆ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్‌లో సోమవారం బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. తెలంగాణ సబ్బండ వర్గాల ఆకాంక్షల నుంచి పుట్టిందే బీఆర్‌ఎస్ పార్టీ అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో తెలంగాణ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్ రెడ్డి, నేతలు పూజ నరేందర్, నందిపేట్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, నాయకులు గంగామోహన్ చక్రు, లింబాద్రి గౌడ్, మధర్, వాకిడి సంతోష్ రెడ్డి, తదితరులున్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 వృషభ-10.30, ఎల్‌వైఎఫ్-1.40, 28సీ-7.55, కోర్ట్-4.45, 10.25

స్క్రీన్-2 సికిందర్ (హిందీ) - 10.00, 1.00, 7.10, 10.10, రాబిన్‌హుడ్-4.00

స్క్రీన్-3 మ్యాడ్ స్క్వేర్-11.20, 2.05, 4.50, 7.35, 10.20

స్క్రీన్-4 కోర్ట్-10.10, రాబిన్‌హుడ్-1.15, 10.20 శారీ-4.25, ఆదిత్య369-7.15



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్సడ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,800	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	83,805		

– నిజామాబాద్ బిజినెస్

గిడ్డంగి నిర్మాణానికి శంకుస్థాపన

వేల్పూర్ : లక్కోరలో రూ.9 లక్షలతో నిర్మించే 100 మెట్రిక్ టన్నుల గిడ్డంగి నిర్మాణానికి డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిడ్డంగి నిర్మాణం వల్ల లక్కోర గ్రామస్తులకు ఎరువులు నిల్వచేసి అందివ్వడానికి సౌకర్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆయనను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఐ సుభాష్, వేల్పూర్ సొసైటీ వైస్ చైర్మన్ భైరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి